క్లుప్తంగా

25న గురుకుల పాఠశాల ప్రవేశపరీక్ష

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల, దుప్పలవలస సాంఘిక సంక్షేమ గురుకులు పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతులకు సంబంధించి మిగులు సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు బి.చిట్టిరాజు, ఎస్.పద్మజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రంలోగా పేర్లు ఆయా పాఠశాలల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. 25న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 6, 7 తరగతుల్లో ప్రవేశాలకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎచ్చెర్ల పాఠశాలలో 6వ తరగతిలో 8 సీట్లు, ఏడో తరగతిలో 6 సీట్లు, తొమ్మిదిలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దుప్పలవలస పాఠశాలలో 6వ తరగతిలో 21 సీట్లు, ఏడో తరగతిలో 7 సీట్లు, ఎనిమిదిలో 5 సీట్లు, తొమ్మిదిలో 6 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సన్మార్గంలో నడవాలి



శరత్‌బాబును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరంలో జరుగుతున్న ఆధ్యాత్మిక ప్రవచనాల్లో భాగంగా ఆదివారం జంధ్యాల శరత్‌బాబు 'ఏది శాశ్వతం' అనే అంశంపై ప్రసంగించారు. మూలాధారమన్న ఇంగితం మనిషికి ఉన్నా తాత్కాలిక ప్రయోజనాల కోసం ఎంతకైనా దిగజారుతుండటం బాధాకరమన్నారు. మాట్లాడే మాటలకు, రాసే రాతలకు, చేసే పనులకు పొంతన ఉండకపోవడం నేటి దుస్థితికి మూల కారణమన్నారు. మనిషి తనమే శాశ్వతమనే విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మోహనరావు, ఈశ్వరరావు, కోమలరావు, శ్రీమన్నారాయణ, బాబూరావు, కామేశ్వరరావు, విశ్వేశ్వరరావు, సరస్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు



జస్టిస్ సుబ్బారెడ్డితో బార్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సుబ్బారెడ్డిని జిల్లా న్యాయవాదులు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులో జరిగే అధికారిక వర్క్‌షాప్ నిమిత్తం జస్టిస్ సుబ్బారెడ్డి వచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు తంగి శివప్రసాదరావు, పిట్ట దామోదరరావు, ఉపాధ్యక్షులు ఇప్పిలి సీతారాజు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కిలారి ఈశ్వరరావు, డాక్టర్ ఎన్ని సూర్యారావు, న్యాయవాదులు వాన కృష్ణచంద్, కొమరాపు ఆఫీస్‌నాయుడు, మామిడి క్రాంతి, బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో రోటరీక్లబ్



పరుపులు పంపిణీ చేసిన రోటరీక్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్/ఎచ్చెర్ల: సామాజికసేవలో రోటరీక్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ముందంజలో ఉంటుందని క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రెసిడెంట్ కె.ఎస్.వి.దుర్గారావు, కార్యదర్శి కె.నాగేశ్వరరావు అన్నారు. రోటరీ క్లబ్, శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో ఆదివారం ఎచ్చెర్ల మండలం పొన్నాడలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులకు 100 బెడ్లు(పరుపులు) వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యకళ, క్లబ్ సభ్యులు కొండబాబు, డాక్టర్ సోమేశ్వరరావు, ఐ.కె.రావు, అమనాన చక్రపాణి, ఎస్.నరసింహమూర్తి, బరాటం భరత్ భూషణం, జి.కన్నబాబు, జి.కౌశిక్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత సత్యవరం

నరసన్నపేట: మండలంలోని సత్యవరం గ్రామంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న ఎగ్గళ్ల కృష్ణప్రసాద్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 40 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఫైనల్‌కు పెద్దపాడు, వైకేపీ లెవెన్(సత్యవరం) జట్లు చేరాయి. ఫైనల్‌లో వైకేపీ లెవెన్ జట్టు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాణించి ట్రోఫీ గెలుచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన పెద్దపాడు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. 98 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు చేసిన సత్యవరం వైకేపీ లెవెన్ జట్టు 9.2 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకొని ట్రోఫీని చేజిక్కించుకుంది. విన్నర్స్‌కు ట్రోఫీతోపాటు రూ.25 వేల నగదు, రన్నర్స్ జట్టు పెద్దపాడుకు ట్రోఫీతోపాటు రూ.12.500 నగదు బహుమతులు అందించారు.

జగన్నాథ మందిరం..
సర్వాంగ సుందరం

- త్వరలో జరిగే జగన్నాథ ఉత్సవాలకు ముస్తాబు
- బొందిలీపురంలో 300 ఏళ్లనాటి నాటి మఠం
- గోడలపై ప్రత్యేక ఆకర్షణగా భాగవత శిల్పాలు
- ఒడిశా సంప్రదాయం మేరకు పూజలు



బొందిలీపురంలోని జగన్నాథ స్వామి ప్రధాన ఆలయం

శ్రీకాకుళం కల్చరల్ : జిల్లా కేంద్రంలోని బొందిలీపురంలో జగన్నాథుని ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. త్వరలో జరిగే జగన్నాథుని రథయాత్ర ఉత్సవాల కోసం గుడిని చక్కగా తీర్చిదిద్దారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో గోడలపై భాగవత ఘట్టాలకు సంబంధించిన శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

చారిత్రక గాథ..

ముల్కదాస్ మహారాజ్ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ఆలయాల నిర్మాణం చేపడుతూ శ్రీకాకుళంలోని బొందిలీపురం ప్రాంతానికి వచ్చారు. సదావర్తి పులహరి తఖియా మఠం పేరిట గుడి నిర్మించారు. ఈ స్థలాన్ని ఆనాడు ఔరంగజేబు ఇచ్చినట్లుగా చెబుతుంటారు. అనంతరం ముల్కదాస్ శిష్యుడు రాజారాందాస్ బావాజీ దశాబ్దాల క్రితం పూరీ నుంచి జగన్నాథుని విగ్రహాలు తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. దీనిని తెలుసుకున్న ఔరంగజేబు హేళనగా జగన్నాథునికి ప్రసాదంగా ఆవు మాంసాన్ని పంపుతాడు. అది తీసుకొని దానిపైన గుడ్డ కప్పి జగన్నాథస్వామికి నైవేద్యం తీసుకెళ్లి దేవుడి ముందుంచుతారు. అక్కడ గుడ్డ తీయగానే ఆవు మాంసంతో నిండిన ప్లేటు మిఠాయిలుగా మారిపోవడంతో ఔరంగజేబు ఆశ్చర్యపోతాడు. వెంటనే తన తప్పు తెలుసుకొని రాజారాందాస్ బావాజీకి క్షమాపణ కోరినట్లు ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. ఈ గుడిని ఇప్పటి వరకు 11 తరాలకు చెందిన వారు కొలిచినట్లు తెలుస్తోంది. ఇక్కడ వందల ఏళ్లుగా క్రమం తప్పకుండా రథయాత్ర ఉత్సవం జరుగుతుంటుంది. ప్రస్తుతం ఫల్హారీ మహంతి లక్ష్మీధర దాస్ బావాజీ 12వ బావాజీగా కొనసాగుతున్నారు.

రూ.60 లక్షలతో పునర్నిర్మాణం..

జగన్నాథుని మఠంలో ఇటీవల పలు అభివృద్ధి పనులు నిర్వహించారు. సుమారు రూ.60లక్షల వ్యయంతో ప్రధాన గుడి గోపురానికి రంగులు వేశారు. ప్రధాన గుడి, ప్రహరీ చుట్టూ దశావతారాలు, అష్టలక్ష్ములు, రాధాకృష్ణులు, భాగవత కథను తెలిపే ఘట్టాలను వివరిస్తూ శిల్పాలను చెక్కించి వాటికి రంగులు దిద్ది సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం పరిసరాలను టైల్స్ వేశారు.

ఒడిశా సంప్రదాయంలో..

ఇక్కడి జగన్నాథునికి ఒడిశా రాష్ట్రం పూరీ జగన్నాథుడి తరహాలోనే సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తారు. ఇలిసుపురం కూడలి వద్ద గుడించాలో తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆ సమయంలో రోజుకొక అవతారంతో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. బొందిలీపురంలోని మఠం నుంచి ఊరేగింపుగా స్వామివారిని ఇక్కడికి తీసుకొస్తారు.



ఆలయంపై ఆకట్టుకుంటున్న శిల్ప సంపద



గోవర్ధన గిరిధారుడు

సంప్రదాయం కొనసాగింపు



జగన్నాథ స్వామికి పూరీ శ్రీమందిరం తరహాలోనే సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తున్నాం. మఠాన్ని ఇటీవలే పునఃనిర్మాణం చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టాం.


– లక్ష్మీధరదాస్ బావాజీ, సదావర్తి పులహరి తఖియా మఠం, బొందిలీపురం



ఆలయ గోడలపై శిల్పాలు



విష్ణుమూర్తి విగ్రహం



భాగవత ఘట్టాలు

యువత పోరు విజయవంతం చేయండి



యువత పోరు విజయవంతం చేయాలని కోరుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచిందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ధ్వజమెత్తారు. రణస్థలం మండల కేంద్రంలోని వైఎస్సార్‌ సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న యువత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని బూటకపు హామీలతో మోసం చేసి గద్దెన నెక్కిన చంద్రబాబుకు పరిపాలించే అర్హత లేదన్నారు. ఉద్యోగం లేకపోతే నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ముఖం చాటేస్తున్న మోసగాడు చంద్రబాబు అని విమర్శించారు. ఏడాది పాలనలో ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయని కూటమి ప్రభుత్వంపై నిరసన బాట పట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు చేసిన మోసాలను ఎండగట్టేందుకు నిర్వహిస్తున్న యువత పోరుకు నియోజకవర్గానికి చెందిన యువతీ యువకులంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతపోరుకు తరలిరండి



పేడాడ శ్రీరామమూర్తి

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి మోసగించిందని, ఈ నేపథ్యంలో యువతకు బాసటగా నిలిచేందుకు కలెక్టరేట్ వద్ద సోమవారం జరిగే యువత పోరు ధర్నాకు తరలిరావాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం దవళపేట గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు, నిరుద్యోగ యువత, రైతులను.. ఇలా అన్ని వర్గాలను చంద్రబాబు బూటకపు హామీలతో మోసం చేశారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి నిరుద్యోగ యువత తరలివచ్చి సంఘీభావం తెలియజేయాలని కోరారు.

పేకాట ఆడుతూ పట్టుబడిన టీడీపీ నేతలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని టౌన్‌హాల్ సమీపంలో టీడీపీ నాయకుడు పాండ్రంకి శంకర్ నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌లో అతనితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతూ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డారు. శంకర్‌తో పాటు అతని సోదరుడు దేవేంద్రనాయుడు, ఆమదాలవలసకు చెందిన మరో టీడీపీ నాయకుడు పరధామ విజయ్ రామ్, నాగరాజులు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.8,820 నగదు స్వాధీనం చేసుకుని ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. శంకర్ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడవుతారన్న ప్రచారం జోరందుకున్న సమయంలో ఇలా పట్టుబడటంతో స్థానిక ఎమ్మెల్యే నుంచి ఒకటో పట్టణ పోలీసులకు విపరీతమైన ఒత్తిడి వచ్చినట్లు తెలుస్తోంది. నగరంలో ఈ వ్యవహారం అప్పటికే చర్చనీయాంశంగా మారడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సైకిల్ మెకానిక్ @ 75 ఏళ్లు



ఈ చిత్రంలో ఉన్న వృద్ధుడి పేరు కొండేటి మోహన్‌రావు. వయస్సు 75 సంవత్సరాలు. గత 65 ఏళ్లుగా జి.సిగడాంలో సైకిల్ రిపేర్ పనులు చేస్తున్నారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా పదేళ్ల వయసులోనే సైకిల్ మెకానిక్ అవతారం ఎత్తారు. 1968లో సైకిల్ ధర రెండు వందల రూపాయలు ఉన్నప్పటి నుంచి రిపేరింగ్ పనులు చేస్తున్నారు. అప్పట్లో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఒకే సైకిల్ షాపు ఉండేది. వివాహ సమయంలో పెళ్లి కొడుకుకు సైకిల్ ఇచ్చేందుకని మంచి సైకిల్‌ను ఎంపిక చేసేందుకు మోహన్‌రావునే తీసుకెళ్లేవారు. ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్నా సరే ప్రతి రోజు ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు సైకిల్ రిపేర్లు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు జగదీష్ మోటార్‌బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు.

–జి.సిగడాం

పొంచి ఉన్న ప్రమాదం



మఱ్రివలస- మానంపేట గ్రామాల మధ్య ఒరిగిన స్తంభాలు



మానంపేటలో స్తంభాలకు అలుముకున్న పొదలు

ఖరీఫ్ మొదలవుతున్న తరుణంలో రైతన్నలు పొలం పనుల్లో బిజీగా ఉంటున్నారు. అయితే చాలాచోట్ల పొలాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. సగానికి పైగా ఒరిగిపోయి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితుల్లో ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జి.సిగడాం మండలం మఱ్రివలస పంచాయతీ మానంపేట గ్రామ సమీపంలో మడ్డువలస కాలువ వద్ద స్తంభాలు ఒరిగిపోయి కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల స్తంభాలకు పొదలు అల్లేసి అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

– జి.సిగడాం



మానంపేట-సీతంపేట వెళ్లేదారిలో స్తంభం దుస్థితి

ఒంటికాళ్లపై నిరసన



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం ఒంటికాళ్లపై నిల్చుకుని నిరసన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ 40 రోజులుగా నిరసన చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగిస్తే ఉద్యమం ఉద్ధృతం చేస్తామన్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

కాలభైరవుడికి అభిషేకాలు



బలగ నాగావళి తీరంలోని బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాలభైరవ స్వామికి అభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, హారతులు నిర్వహించి అలంకరణ చేశారు. గోపూజ, నిత్యాన్నదానం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కె.ఎల్.ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రంలో అఖిలగాండ్ల తెలికుల కులస్తులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతం డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అఖిల గాండ్ల తెలికుల సంఘం సామాజిక భవనంలో జిల్లా సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు కొమనాపల్లి లక్ష్మణ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముందుగా టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన గాండ్ల తెలుకుల విద్యార్థులకు గ్రోసుల గోపాలయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్, నగదు ప్రదానం చేశారు. అనంతరం గాండ్ల తెలికుల జిల్లా యువజన సంఘం , మహిళా సంఘం కార్యవర్గాల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని గాండ్ల తెలికుల సామాజిక వర్గాన్ని ఒకేతాటిపై తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 14న శ్రీకాకుళంలోనే గాండ్ల తెలికుల రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. గత ఎన్నికల్లో గాండ్ల తెలికుల వారికి అన్ని రకాలుగా ఆదుకుంటామని చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ అనేక హామీలు ఇచ్చారన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం గాండ్ల తెలుకుల సామాజికవర్గం నువ్వులు, వేరుశనగతో పాటు మరికొన్ని విత్తనాలనుంచి తైలం తీసే వృత్తి చేపట్టి.. గౌరవంగా జీవించే పరిస్థితి ఉండేదని, కర్రగానుగుల స్థానంలో యంత్రాలు రావడంతో ఉపాధి కోల్పోయారన్నారు. అప్పటినుంచి వెనుకబాటుతనంతోపాటు విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక, రాజకీయాల్లో వెనకబాటుకు గురయ్యారని చెప్పారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్రు మధుసూదనరావు, ప్రతినిధులు దాసరి జ్ఞానమూర్తి, ఇంజరాపు విశ్వనాథం, కెల్లా శ్రీనివాస్, జోన్ వన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రవిచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు కెల్లా ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ కల్లేపల్లి జగన్, జిల్లా మహిళా కన్వీనర్ కె.విజయ, యువజన సంఘం నూతన అధ్యక్షుడు తెలుకుల మన్మధ, జిల్లా ఉపాధ్యక్షులు గణేష్ సాహు, తలగాపు కామేశ్వరరావు, రాష్ట్ర సంఘం మాజీ డైరెక్టర్ ఎండపల్లి ఈశ్వరరావు, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, పి.గోపి, గండేపల్లి శ్రీనివాస్, కల్లేపల్లి శ్రీనివాస్, తెలుకుల సురేష్, వెంకటరామరాజు, బాలు, కెల్లా త్రినాథ్, అంబటి శ్రీనివాస్, జామన సాయిరాజ్, తలగాపు వెంకటరమణ పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం



జే.ఆర్.పురం కార్యకర్తలతో మాట్లాడుతున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలని, కార్యకర్తల శ్రేయస్సుకు అండగా నిలుస్తానని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ కార్యాలయంలో జె.ఆర్.పురం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆదివారం 'కార్యకర్తే కీలకం' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఓటమి పాలైందని నిరుత్సాహం పడాల్సిన అవసరం లేదని, మనకు 40శాతం ఓటు బ్యాంక్ ఉందని గుర్తు చేశారు. పార్టీ కార్యకర్తలను కూటమి ప్రభుత్వం ఎంత భయపెట్టినా దీటుగా బదులివ్వాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల్లోని తల్లికి వందనం పథకం అమలు చేసినా లేనిపోని కొర్రీలు పెట్టి అర్హులకు అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, ఎంపీటీసీ పచ్చిగుళ్ల సాయిరాం, నాయకులు దుర్గాసి రామారావు, ముద్దాడ రాజశేఖర్, దన్నాన సీతారాం, ఇడదాసుల తిరుపతిరాజు, టేకు బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లిలో 'సంప్రదాయ' సందడి



సంప్రదాయక వస్త్రాలతో సూర్యనమస్కారాల పూజల్లో కూర్చున్న భక్తులు

అరసవల్లి:

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. ఆదిత్యుని మూలవిరాట్టుకు ప్రత్యేక తులసీదళాలతో అలంకరించి ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచే సర్వదర్శనాలకు అనుమతించేలా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టారు. అలాగే భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఆలయ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.4,33,000, విరాళాల రూపంలో రూ.93,922, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.13 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ ప్రసాద్ ప్రకటించారు. సూర్యనమస్కారాల పూజల్లో ప్రత్యేకత కనిపించింది. పురుషులు చొక్కా, పంచెలు, మహిళలు చీరలు, చుడీదార్లు ధరించి పూజల్లో కూర్చున్నారు. సూర్యనమస్కారాల పూజలతో పాటు అభిషేకాలు, కల్యాణ సేవల్లోనూ ఇదేవిధానం అమలు కానుందని ఈఓ ప్రసాద్ ప్రకటించారు. తొలిరోజు కావడంతో ఆలయ అధికారులే పంచెలను విక్రయించి భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

ప్రసాదాల విభాగంలో ఈఓ తనిఖీలు

ఆలయానికి చెందిన కేశఖండన శాల, గోశాలతో పాటు అన్నదాన ప్రసాదాల తయారీ విభాగాన్ని ఆలయ ఈఓ ప్రసాద్ ఆదివారం తనిఖీ చేసారు. అక్కడ జరుగుతున్న విధివిధానాలను, ఆలయ ఉద్యోగుల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. కేశఖండన శాలలో ఉద్యోగుల తీరుపై మండిపడ్డారు. అలాగే ప్రసాదాల విభాగంగా బాధ్యుడు అట్టాడ శ్రీనివాసరావును కూడా సరుకుల నిల్వలపై ఆరా తీసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రసాదాల విక్రయాల్లో అక్రమాలున్నాయని గుర్తించామని, ఇప్పటికే ఓ దినసరి వేతనదారున్ని తొలిగించామని ఈఓ గుర్తుచేశారు.